
# అపోహ!!




"అమ్మా! అక్కయ్యనెందుకే ముస్తాబు చేస్తున్నారు. పేరంటం వుందా. మరైతే నాకూ చెయ్యండి" అంటూ ఆరేళ్ల అనసూయ అడిగిందానికి అమ్మలక్కలంతా గొల్లుమన్నారు. ఆ నవ్వులో అంతరార్థం అనసూయకు బోధపడక పోయినా పువ్వులా మొఖాన్ని విప్పి తనూ శృతి కలిపింది.

"ఇవాళ మీఅక్కకు శోభనమే" అందొక యవ్వనంలో తల చెడ్డ ఉవిద.

"శోభనమంటే ఏవిటే అమ్మా!" అని మళ్లీ ప్రశ్నించినదానికి అనసూయకెలా సమాధానం చెప్పాలో తెలీక వాళ్లమ్మ కొంచెంసేపు తికమకపడి "ఛీ! నోర్మూయ్యి! ఏమిటే దరిద్ర ప్రశ్నలూ నువ్వూను" అంటూ కసిరింది. అయినా ఆపిల్ల పట్టిన పట్టు విడువకుండా... "ఊ...ఊ...నాకుకూడా కావాలి శోభనం..." అంటూ మారాము చేస్తుంటే అంతా మళ్లీ గొల్లు మన్నారు. అమాయక హృదయం రెపరెపలాడి పోయిందే తప్ప తనక్కావలసిన సమాధానాన్ని పొందలేక పోయింది.

శోభనమంటే ఏవిటో తెలియని పసి హృదయంలో అమ్మ మీదకోపం, అక్కయ్యను అడిగి తెల్సుకోవాలన్న ఆకాంక్ష ఏర్పడ్డంతో ఓ వారగా నిలబడి ముస్తాబవుతున్న అక్కయ్య రేవతి వైపే చూస్తూనిలుచుంది.

పద్దెనిమిది వసంతాలుచూసిన రేవతి పడుతున్న వేదన, బాధ ఎవరికి మాత్రం తెలుసు? అనసూయ వేసిన చిలిపి ప్రశ్నకు అమ్మలక్కలిచ్చిన 'శోభనం' అనేజవాబు రేవతికి పుండుమీద పొడిచినట్లయింది.

ప్రక్కింటి గడియారం ఆరుసార్లు కొట్టింది. పక్షిగణాలు తమతమ నివాసాలకు చేరుకుంటున్నాయి. పెరట్లో దూడలు 'అంబా' అని అరుస్తూ ఆకలికి అల్లాడి పోతున్నాయి. దగ్గరలో నున్న పార్కులో సందడి అధికమైంది. రేడియో ఒకేఘోష పెడుతూంటే రేవతి గుండెల్లో జలపాతాలు రెచ్చి పోతున్నాయి.

... రచన: "నాగశ్రీ" ...

మేడమీద తన గదిలో ఏకాంతంగా కూర్చుని ఒక్కసారి తనముస్తాబుని-ముస్తాబు మరుగుపడి-మెరుగుల్లో మెరుస్తున్న దేహాన్ని చూసుకుంది. తెల్లని శరీరం-దానికి జతగా ఊదారంగు జార్జెట్ చీర...సన్నని తిన్నని బాహువులు-సుమారుగావున్న దండలు-వాటికి జతగా వెల్వెట్ జాకెట్టు-ఎత్తయిన మత్తును కల్గించే వక్షోజాలు-వాటిని అదిమిపట్టుతూ బిగువైనలోబాడీ-సన్నని అందమైన మెడ-అలంకారంగా చంద్రహారం-వజ్రాల నెక్లెస్...ఈ ముస్తాబుని చూసి ఆనందించేది ఎవరు? తనతల్లి తల్లితో వచ్చిన అమ్మలక్కలు-తననా రాత్రి పొందబోయే ఆ వరశిఖామణి ఆనందం-కాని...కాని తన మనస్సులో మాత్రం స్థావర మేర్పరచుకున్న తనక్కావలసిన-కోరుకున్న 'సుందరం' ఎలా ఆనందిస్తాడు. తను సుందరానికి తీరని ద్రోహం తలపెట్టింది. సుందరంలో తియ్యని అనుభూతులను కల్లజేసింది. మమతల్ని రేకెత్తించింది. తన కోసం పాపం సుందరం ఏమైనా చేస్తాడు.

ఒక్కసారి క్రితం సంవత్సరంలోకి ఆలోచనలు పరుగెత్తాయి. మరుపురాని సన్నివేశాలు మనస్సులో బొంగరంలా తిరగాడసాగాయి.

"తను కాలేజీలో చేరిన క్రొత్త రోజులు. అప్పటికి రేవతి తండ్రి కామరాజు బ్రతికే వున్నాడు. తండ్రి కామరాజు రిటైరైన తాసిల్దారు. కామరాజంటే ఆరోజుల్లో పిట్టలుకూడా నీరు త్రాగేవికావు. చండశాసనుడు. తనకు తోచిందేగాని ఎదుటివారి మనస్తత్వాల నూహించే గుణంగాని బలంగాని లేనివాడు. హోదాలోవుండగానే పెరిగిన కూతురు పెళ్లిచేయాలని ఉబలాటంతో రేవతిపెండ్లి చేసివేశాడు. అప్పటికామె వయస్సు పదిసంవత్సరాలు. బాల్యవివాహాలు నిషేధింపబడ్డా బాల్యంలో చేస్తే వున్న ఆనందం-యవ్వనదశలో లొంగలేని పిల్లల పెళ్లిళ్లు చేస్తే వచ్చే కష్టనష్టాలను ముందుగానే వూహించే స్వభావం స్వభావసిద్ధంగా పుంజీభవించింది ఆయనలో. అందుకే ఎంతకాదన్నా అంతేనంటూ పట్టుదలతో అయిందనిపించుకున్నాడు.

తర్వాత రెండేళ్లకు అనసూయ పుట్టగానే మళ్లీ అయనలో వివాహ సమస్యరేగింది. అయితే ఈమారు తన ఆశయం నెరవేర కుండానే కండ్లు మూసాడు. అనాటి ఆనందం రేవతికీనాడు వైపరీత్యంగా మారింది.

తనుచేరిన కాలేజీ ఓమామిడితోటలో కట్టబడింది. దానికిముందుగా ఓకాలువ. ఊళ్లోకి పోవడానికి బాటమీదుగా అయితే అరమైలు నడవాలి. పడవమీద కాలువనుదాటితే అయిదు నిముషాలు.

ఓనాడు తను ఒంటరిగా పడవ దాటుతోంది. పడవలో సుందరం పడవ వాడూతప్ప మరెవ్వరూలేరు-పడవసాగుతోంది. ఉండుండి పడవతిరగ బడింది. పట్టుకోలేక అంతానీటిలో పడ్డారు. రేవతి సగంవరకు నీటిని త్రాగివేసింది. ఆ సమయానికి అతను పట్టుకోపోతే ఈ నాడు ముస్తాబయ్యే అవుసరంలేకపోను. జోరుగా పారేనీటిలో ఫర్లాంగు దూరం కొట్టుకుపోయింది. చూస్తున్నవారు కేకలు వేయటం తప్ప దిగి సహాయంచేయడానికి రాలేదు. బహుశః మానవత్వపు విలువ అంతేగాబోలు?...తపతపకొట్టుకొంటున్న రేవతిని సుందరం చూసాడు. ఒక్కఅంగలో ఈదుతూ ఆమెను చేరి ఆమెనడుముని తన బాహువుల్లోకి లాక్కున్నాడు. మరోక్షణంలో మరో ఫర్లాంగు దూరంలో ఒడ్డుకి చేర్చగలిగాడు. అయితే ఆమె తెలివితప్పివుంది. తప్పనిసరిగా ఆమెనుతాకి ప్రథమచికిత్స చేసాడు. ఓపావుగంటలో కడగంటిన ప్రాణాలు తేరుకున్నాయి. కనులు విప్పి చూస్తే ఎదురుగా సుందరం బలహీనంగా నవ్విన నవ్వు అతనిలో పరవశత్వాన్ని కలుగజేసింది. ఒకస్త్రీని బ్రతికించేననే ఆనందమేకాని-ఒక యవ్వనవతిని తనివితీర తాకేననే దురభిప్రాయం అతనిలో ఏకోశానాలేదు.

నెమ్మదిగా ఒక్కరొక్కరే మూగసాగేరు. సుందరాన్ని ఎంతో శ్లాఘించారు. అది రేవతిహృదయంలో మరువరాని మధురస్మృతిగా నిలిచిపోయింది. బండిలో ఆమెను లాడ్జికి చేర్చాడు. తర్వాత మిగిలిన ఆడపిల్లలు మిగిలిన శైత్యోపచారాలు చేసారు.

అదే ఆమెకు సుందరానికి తొలిసమాగమం. సుందరం అంటే ఆమెలో ఎంతో ఉధృతమైన, బలీయమైన అభిప్రాయం ఏర్పడింది. అదే ఆమెను అతని పరిచయాన్ని పొందమని ప్రేరేపించింది. క్రమంగా సన్నిహితులైయ్యారు. రోజూ కాలేజీతోటలో కలుసుకోవడం కమ్మగా మాట్లాడుకోవడం. ఒకరంటే ఒకరికి ప్రాణసమాన మవటం ఏర్పడింది.

సుందరంలో ఎటువంటి దుమారం రేగింది? ఎటువంటి భావనకల్గింది?... రేవతి అంటే సుందరానికి ఎంతో ప్రేమ! రేవతితో మాట్లాడ్డం అంటే అతనికి పరమానందం? ఆమెనుండి అతను గతంలో పొందిన ఓ అవ్యాజానురాగాన్ని చూరగొన గల్గుతున్నాడు. పరస్పరాభిమానాల ప్రదర్శనే జరుగుతోంది కాని పరస్పరాభిప్రాయాల్ని చెప్పుకోలేదు. రేవతి తనకు చిన్నతనంలోనే వివాహమైనట్లు సుందరానికి చెప్పలేదు. ఏమంటే సుందరం తనకు దూరమవుతాడేమోననే భయమే ఆ రహస్యాన్ని గుప్తపరచింది. పరీక్షలయినాక శలవలకు తనింటికి వచ్చేసింది. యింటికి వచ్చిన మరునెలలోనే యీహడావుడి తలపెట్టింది తల్లి.

"అక్కయ్యా!" అన్న పిలుపుతో యీలోకంలో కొచ్చింది రేవతి. తిరిగి చూస్తే చెల్లి అనసూయ కన్పడింది.

"అక్కయ్యా!..." ఏదో అనబోయింది.

"ఛీ! నాకేం తెల్సు...పోయి మీ అమ్మనేఅడుగు" అంటూ విదిలించుకుంది. తల్లి యిద్దరికీ ఒక్కరే అయినప్పటికీ తనకీనాడు జరుగబోవు ఘోరాన్కి ఆమెయే కారకురాలవడం వల్ల ఆమెలో ఆమెను అమ్మగా ఆలోచించే వీలైనా కలుగటంలేదు. అమమత-మనస్సు యిప్పుడు కరుడుగట్టుకుపోయింది. తల్లి ఏం చేయదలచుకున్నా తాను చితికిన హృదయంతో జీవంలేని రాతిబొమ్మలా తలవంచాలనే నిర్ణయించుకుంది. ఒకవైపు సంతోష తరంగాలు పంతాలలో కేరింతలాడుతుంటే రేవతి హృదయసీమలో అగ్ని పర్వతాలు బ్రద్దలౌతున్నాయి. ఆ వైపు మందమారుత విమలరాగం...ఈవైపు విషగాలుల కసిదీరని రొద.

అనసూయ నెమ్మదిగా రేవతి దగ్గరకుచేరి "అక్కా! అయనొచ్చారే!" అంది.

"ఆ! ఎవరు..." అంటూ తుళుక్కుమంది రేవతి. ఇంకోగంటలో తను తన జీవనసర్వస్వం అతను దోచుకోబోతాడు యిష్టంలేకున్నా. తన జీవితాంతం అతనితోనే కాపురం చేయాలి. అతని కిష్టం వచ్చినదారినే నడవాలి. సుకుమారంగా పెంచుకున్న సున్నిత శరీరాన్ని అతని పాదాక్రాంతం చేయాలి...ఛీ...ఛీ... అనుకుంది.

"రా! అక్కయ్యా అయన తోటలో వున్నారు" అంది అమె ఆలోచనల కంతరాయం కలిగిస్తూ...

ఉన్నట్టుండి ఆమెలో ఆనందం, ఆవెనుకే ఆవేదన అధికమవసాగాయి. తోటలో అనగానే సుందరం గుర్తుకొచ్చాడు. ఒక్కపరుగున గుమ్మందాకా వెళ్లింది. బ్రేకుపడ్డబస్సులా తక్కున ఆగిపోయింది. ఏముఖంపెట్టి సుందరాన్ని చూడడం? ఏమని పల్కరించడం "రేవతీ చివరకు యింతేనా" అని అతనడిగితే తాను ఏమని సమాధానం యివ్వడం? ఆమె మస్తిష్కంలో శతశతఘ్నులు ప్రేలిపోతున్నాయి. ఎన్నోనముద్రాలు ఉధృతమై ఘోషిస్తున్నాయి.

ఎలాగైనా అతన్ని చూడాలనే నిర్ణయించింది సారథిలేని మనస్సు.

తోటలో ప్రవేశించింది. నీలాకాశం వైపుచూస్తూ నిలబడ్డాడు సుందరం. అతనిలో ఎటువంటి ఆవేశంకాని, ఆ వేదనకాని రేవతికి కన్పించలేదు. దగ్గర సావెళ్లింది. అతను చూడనేలేదు, రెండడుగుల వ్యత్యాసంలో నిలబడింది. చటుక్కున యిటు తిరిగాడు. జగన్మోహన రూపంలో అవతరించిన అప్సరసలా అమెను తిలకించాడు. అతనిలో ఆనందం హద్దులుదాటి పోయింది. "రేవతీ! అన్నాడు.

ఒకసారి తలపైకెత్తి సుందరం వైపు చూసింది. అతని ముఖంలో సంతోషం తాండవించడం గ్రహించి ఆశ్చర్య పోయింది. అతని మనస్తత్వాన్ని అర్థంచేసుకోలేక పోయింది. అయినా తాను పొందుతున్న వేదనవల్ల "క్షమించు" అని అనగల్గింది.

"ఎందుకూ అలస్యమైనందుకా!" అన్నాడు.

"అవును...కాదు..." అంది ఆందోళనతో"

"అదేం అలా వున్నావు...ఇది ఆనందించ వలసిన సమయంకాని అలా దిగులు పడొచ్చునా రేవతీ" అన్నాడు బుజ్జగింపుగా,

"ఆనందం...అది ఎలావుంటుందో తెలుసుకునే అవకాశం నాకులేదు" అంది స్తబ్దుగా.

"అదేం!...యివాళనీ..." మధ్యలో ఆగిపోయాడు.

"కాదు...నా మరణం...సుందరం నీకు చాలా ద్రోహం చేశాను, మాయని గాయాన్ని కల్పించాను..." అంటూ ఏడ్చింది.

రేవతీ! ఏవిటా మాటలు నాకేమిటి ద్రోహం ఏమిటి గాయమేమిటి నీకేమైనా మతి పోయిందా ఏం..." అంటూ ఆశ్చర్యపోయాడు.

"అవును. మతేపోయింది. కాబట్టే అస్వతంత్రురాలిగా బలహీనగా బ్రతక వలసి వచ్చింది. నాలో బాధను కనీసం గాథగానైనా చెప్పకునే అవకాశంగాని, అనువైన పరిస్థితులుగాని నాకు లభించనప్పుడు మతి పోయినట్లే కదూ" అంది శ్లేషలో.

క్షణంసేపు సుందరం పరితప్త హృదయుడై మరుక్షణంలో ఆసక్తికల వాడై ఒకసారి ఆమెతలను నిమిరాడు. ఆ నిమురడంలో గతంలో పొందిన ఓ అమూల్యానురాగ ప్రదర్శన కళ్లకు కట్టినట్లయింది. అతనిలో ఏదో ఓ దివ్యమైన వెలుగు వెలిగి-ఆ వెలుగులో ఓ సుందర రూపం గోచరించి తన తప్త హృదయాన్ని మృదుహస్తంతో నిమిరినట్లు అనుభూతిని పొందగలిగాడు.

"రేవతీ! యిలా కూర్చో. నిన్ను చూస్తుంటేనాలో ఓ విధమైన—ఒకప్పుడు నాలో యిల్లు కట్టుకున్న అనురాగం తిరిగి యిప్పుడు నీచంద్రికా జ్యోత్స్నలలో మెరిసి నట్టవుతోంది. నిజంగా ఏనాటి ఋణాను బంధమో కాని మన యీ సంబంధం బ్రతికున్నన్నాళ్లు దిన దిన ప్రవర్ధమాన మవాలనే నాకోర్కె..." అన్నాడు.

రేవతి సుందరం ప్రక్కగానే కూర్చుంది. అతని మాటలు విన్న ఆమెలో రేగుతున్న వహ్నిమరింత ప్రజ్వరిల్లి నట్లయింది. నిజంగా సుందరం తన్ను ప్రేమిస్తున్నాడు, కానీ తనే అతనికి తీరని బాధను కల్పిస్తోంది. తను ఎందుకూ పనికిరానిదై వుండుట వల్లే సుందరం జీవితంలో ఆరని చిచ్చును పెట్టింది.

"సుందరం నువ్వు నన్ను క్షమించలేవు నిజంగా నీకు ద్రోహమే చేసాను. నీలోతీయని కోరికల్ని రేకెత్తించాను. విచిత్రానుభూతుల పరంపరలో పరుగెత్తించాను. కాని నాచరిత్ర నీకొక్కనాడైనా చెప్పివుంటే యింతవరకు రాకపోనేమో" అంది ఎంతో దైన్యంగా.

సుందరానికేమీ అర్థంకాలేదు. అమె ధోరణి అతనిలో చేయిపెట్టి కలచినట్లయింది. నిజమే అనుభూతుల అభివర్ధనజరిగింది. అయితే అందలి అంతర్యం? అమె ఎలాగ్రహించుకొంది? తన గ్రహణకు అమె విభిన్నమా? పొఱపాటున తనభావన అమెలో తీరని వ్యథనుకల్గించిందా! అయితే తనే క్షమార్పణ వేడుకోవాలి. అమె చరిత్ర తనకు తెలిసిందిగాక అధికమేమైనా వుందా! అయితే అందులో,

"సుందరం ఏనాటికైనా నిజంచెప్పి నాలోని బాధను కొంతవరకైన ఉపశమింపజేసుకోవాలి. నన్నునువ్వు ఎన్ని దుర్భాషలాడినా క్షమిస్తే అదేపదివేలు" అంటూ అతనివైపు చూసింది.

"అదేవిటి రేవతీ అసలు విషయం చెప్పకుండా మాటిమాటికి క్షమించ మంటావ్. దయచేసి అదేదోపోని చెప్పు" అన్నాడు

రేవతి మరోసారి అతనివైపు పేలవంగాచూసి "నేను...నేను వివాహితను" అంది.

"అవును, నాకూతెల్సు" అన్నాడు తక్కున.

రేవతికి ఎలక్ట్రిక్‌షాక్ తగిలినట్లయింది "తెలుసా...మరి...మరి..." మరి చెప్పలేక పోయింది.


"రేవతి నీ కథ యావత్తూ నాకు తెల్సు-అయినా నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నాక్కావలసింది నువ్వు వేయికాలాలు హాయిగా బ్రతికి నాకు ఆనందం కల్గజేయడమే. నిన్ను చూస్తుంటే పోయిన నాచెల్లెలు 'రూప' గుర్తుకొస్తుంది, నీలో ఆమెరూపాన్ని చూడగల్గుతున్నా నీనుండి నాకు మరి లభించ దనుకున్న సోదరిప్రేమే లభి

స్తోంది, అంతకంటే ఏంకావాలి..." అన్నాడు వాత్సల్య పూర్వకంగా.

రేవతి తల గిర్రున తిరిగిపోయింది. తన ఎదుటవున్న పరిసారాలన్నీ తల్ల క్రిందులుగా కన్పించాయి. తను ఎంత అధోలోకానికి పోయిందో, ఎంతటి విప రీత పరిణామాన్ని సృష్టించుకుందో గ్రహించుకొంది. ఇంకానయం తాను సుందరాన్ని ప్రియునిగా ప్రేమిస్తున్నా నని అతనితోచెప్పి అతని హృదయాన్ని కలతపరచలేదు. అందుకామె మన స్సులో వేయిదేముళ్లకు నమస్కరించు కొంది.

ఆమెలో యిప్పుడు క్షణం క్రితం వరకు వేధించిన బాధ సమసిపోయింది. అపోహ ఎంతటి అనర్థానికి దారితీస్తుందో పూర్తిగా గ్రహించింది. తాను యిప్పుడు సుందరానికి నిజమైన చెల్లెలు. ఆనందా నికి ధర్మపత్ని. కర్తవ్యాన్ని పరిపాలిం చక తప్పదు. ధర్మాన్ని స్మరించితీరాలి.

తీసాడు. అమ్మలక్కలంతా నోళ్లువిప్పి చూస్తున్నారు. రాళ్ల నెక్లెస్ బయటకు "ఇది నా కానుక తీసుకో" అన్నాడు.



ఒక్కసారిగా "అన్నయ్యా!" అంటూ కాళ్లమీద పడిపోయింది. తన దుష్టభావాలన్నీ సమసి పోవాలని పదే పదే మొక్కుకొంటూ కన్నీటితో—పవి త్రాత్మతో అతని పాదాలకు తర్పణం చేసింది.

"లే చెల్లీ! ఆడపిల్ల అన్నతర్వాత ఒక్కనాటికైనా అత్తవారింటికి పోవల సిందేగా. నాకు దూరమౌతున్నావనిబాధ పడుతున్నావని నాకూ తెల్సు కాని నా మనస్సెప్పుడూ నీ దగ్గరే వుంటుంది. ఎప్పుడు పడితే అప్పుడే వచ్చి నిన్ను చూస్తాను. లే-వేళయింది." అంటూ లేవదీసాడు.

అన్నయ్యకు మనః క్లేశం కలిగించ కూడదు.

మౌనంగా యింట్లోకి నడిచింది. వెంట సుందరం కూడా వుండి నట్టింటి వరకు వచ్చాడు. లోనుండి రేవతి తల్లి ఎదురొచ్చింది "ఇంతవరకు ఎక్కడు న్నావే రేవతీ" అంటూ దీర్ఘం తీసింది. సుందరాన్ని చూసి గతుక్కుమంది.

"అమ్మా... ఇతను అన్నయ్య" అంది పొంగే ఆనందంతో. సుందరాన్ని ఆమె ఒకసారి నఖశిఖపర్యంతం చూసి "రా! నాయనా కూర్చో!" అంది.

"చెల్లీ యిలారామ్మా!" అంటూ పిలచి జేబులోనుండి ఏదో బయటకు

అందరికళ్లు మిలమిల మెరిసాయి. రేవతి హృదయం పరమానందంలో పరవళ్లు త్రొక్కింది.

బయట జట్కాబండి ఆగింది. పెళ్లి కొడుకు వచ్చాడన్నారు అందరూ. అందరి కళ్లూ గుమ్మంవైపు తిరిగాయి. రేవతి సుందరంవైపుచూసి సిగ్గుతో తల వంచుకొని తుర్రుమంది లోనికి—

ఆమెచూపిన అవ్యాజానురాగానికి సుందరం డెందం ఉప్పొంగింది. ఆ చోట తనకిక ఉండవలసిన పని లేదని తేలిక పడ్డమనస్సుతో యింటి ముఖం పట్టాడు. ★




# అధర్మ విజయం

రచన :
వావిలాల
నరసింహారావు

శాంతమ్మకు పాతికేళ్ళు నిండాయో లేదో, భర్త అకస్మికంగా గుండె ఆగి మరణించాడు. శాంతమ్మ గుండెపగిలేలా యేడ్చింది. కాని, లాభం లేకపోయింది. అమెకు 'నా' అన్నవాళ్లెవరూ లేకపోయారు యీ విశాల ప్రపంచంలో. తల్లి, తండ్రి తన చిన్ననాడె చనిపోయారు. భగవంతుడు తనకు ఒక్క నలుసైనా ప్రసాదింపలేని నిర్దయుడయ్యాడు. తన భర్తకున్న ఆస్తి చిన్నకొంపతప్ప మరేం లేదు పాపం. రెక్కాడితే గాని డొక్కనిండని బ్రతుకు మోస్తూ కాలం గడిపాడు తనభర్త. నేడు ఆ అదృష్టానికి గూడా నోచుకోలేదు, అభాగ్యురాలైన శాంతమ్మ. అఖరికి మిగిలిన ఒకరిద్దరు దూరపు బంధువులు లోకాచార ప్రకారం మాటలతో ఓదార్చి వెళ్లిపోయారు.

శాంతమ్మకు యీ పదిరోజులనుండీ ఎవరు వచ్చారు? ఎలా జరిపారు? ఎప్పుడెళ్లిపోయారు? ఏమని ఓదార్చారు? యీవిషయాలు ఒక్కటి గూడా తెలీదు. అసలామె యీ పదిరోజుల నుండీ పచ్చిమంచినీళ్లయినా పుచ్చుకొన్నది గూడా సందేహాస్పదమే. గదిలో ఒక్కటే పరుండి కృళ్ళి కృశించిపోయింది. అఖరుకు యీ యిద్దరు బంధువులు వెళ్ళిపోయే సరికి గుండె బ్రద్దలయ్యేలా ఏడుస్తూ, నెత్తి బాధుకుంది వళ్ళుతెలియని దుఃఖావేశంతో. 'నీ ఖర్మం' అన్నట్లుగా ఒక్క నిమిషం దిగ్భ్రాంతులై, ప్రశాంతంగా వెళ్ళిపోయారు. అంతకంటె ఏం చేయగలరు ?

కొద్దిరోజులు జరిగేయి. ఆమె క్రమంగా మామూలు మనిషి అయింది. కాని, తన జీవనమెలా జరగాలి ? ఓ చిన్నయిల్లు, కొద్ది సామాను ఒక్క వస్తువూలేదు. రాగిదమ్మిడీ మిగల్లేదు. ఇప్పుడామెకు భర్తపోయిన విచారం కంటె దరిద్రబాధనుగురించి విచార మెక్కువగా పీడిస్తోంది. తనకు 'నా' అన్నవాళ్లెవరూ లేరు. ఎక్కడకు వెళ్తుంది ? ఎవరిని ఆశ్రయిస్తుంది ? రాత్రింబవళ్ళు నిద్రకూడా మానేసి బుర్రబద్దలయ్యేలా ఆలోచించింది. కాని, ఎవరున్నారు అమె మొర వినడానికి? ఆఖరుకు ఒక నిశ్చయానికి వచ్చింది కాని అది అంత సులభంగా అయ్యేపనిగా తోచడంలా. ఏమైనప్పటికీ వెళ్లి ఆశ్రయించక తప్పదు. ఎవరాయన? తనభర్తయొక్క యజమాని. లక్షలకొలదీ గడించాడు. యుక్తిపరుడు కాని, రాతిహృదయం కలవాడు.

ఆఖరుకు ఒకనాటి సాయంకాలము వెళ్లి తన సొదంతా వివరించింది. మీరు తప్ప ఇంకెవరూ దిక్కులేరంది. రక్షించినా మీరే, భక్షించినా మీరే నంది, ఎంతో ప్రార్థనాపూర్వకంగా. కాని, ఆ ముసలి యుక్తిపరుడు యీమెను మాటలతో ఓదార్చి, వదలించుకోడానికి నిశ్చయమైనాడు. 'అమ్మాయీ! చూడమ్మా! కష్టాలు అనేవి మానవులకుగాక మానులకొస్తాయా! అయితే కొందరికి ఎక్కువగానూ కొందరికి తక్కువగానూ వస్తుంటయి. ఇటువంటి కష్టాలసమయంలోనే మనం ధైర్యం వహించాలి. ధనసంపాదనకు నీ కొక చిన్న సలహా యిస్తాను. ఇలా అమాయకంగానూ, బేలగానూ ఉంటేమాత్రం నీ కింకా కష్టాలే గానీ సుఖంమాత్రం పొందలేవు. అదీగాక ఇప్పుడు రోజులు పూర్తిగా మారాయి. ధర్మం పూర్తిగా నశించింది. అధర్మం నాలుగుపాదాలతో నడుస్తోంది. విజయం పొందుతోంది కూడాను. ధర్మంగా మడిగట్టుక కూర్చుంటే మాత్రం లాభంకంటె నష్టమే ఎక్కువగా లభిస్తోంది. కాబట్టి యింతకూ చెప్పేదేమంటె నీవు యిలాగాక, పటాటోపం అలవరచుకోవాలి. గడుసుగా మాట్లాడాలి. అబద్ధంపలకడానికి ఏమాత్రం సంకోచం చెందకూడదు. సంఘాలపేర్లెవో కొన్నిటిపేరెత్తుతూ శ్రీమంతుల వద్దకు విరాళాలు సేకరించడం మొదలెట్టావంటె నీకు పుష్కలంగా ధనం లభిస్తుంది. నీ జీవితాన్ని నిశ్చింతగా గడుపుకోవచ్చు. ఇది నా ప్రత్యక్షానుభవం....ప్రత్యక్షానుభవం' అంటూ హ....హ....హ అంటూ తనకుతానే నవ్వుకొని, 'ఇక నీ యిష్టం వెళ్ళొస్తా ఆఫీసు టైమయింది' అంటూ గబగబా వెళ్లిపోయాడు.

శాంతమ్మ నిస్పృహచెంది, ఒక్కనిట్టూర్పు విడిచింది. ఇంత అన్యాయం నావలన అయ్యే పనికాదు. చూస్తూ చూస్తూ ఇంతటి అధర్మానికి ఒడిగట్టలేను. ఇంతకూ తన భర్త యజమాని తనను మాటలతో (అవైనా అక్రమ సలహాలు) తృప్తిపరచి తప్పించుకొన్నాడేగాని తాను కించిత్ సహాయం చేయగల ధార్మిక బుద్ధిగూడా లేదన్నమాట. విశ్వాసఘాతకుడు అనుకొని నిరాశచెందిపోయింది. ఇక దాసీపని తప్ప యితర గత్యంతరమేమీ గోచరించడం లేదు.

ఆ తెల్లవారుఝామునే యీ విశాలప్రపంచంలోనే మరొక క్రొత్తప్రదేశానికి బయలుదేరింది. అక్కడ ఒకదాసీగా మారిపోయింది. 4, 5 యిండ్లలో రెక్కలు విరిగేలా చాకిరి చేసినా నెలకు 5 రూపాయిలుకూడా దొరకడం కష్టమయింది. యీ సంపాదనతో రెండు రోజుల కొకసారైనా మెతుకులు దొరకకున్నయి. కొన్ని కొన్ని యిండ్లలో 'ఏమె.... బుద్ధి లేనిదానా....దుక్కలాగున్నావ్....ఆ పని చెయ్యలేవా .... యీ పనిచెయ్యలేవా .... మీ దాసీవాళ్ళను నమ్మవచ్చా....మీకుతోడు ఒక నీతి గూడానా .... నీకు ఎందరు మగాళ్ళు మారారు? .... ఇలాంటి అసభ్యమైన మాటలంటూంటే నిలువునా నీరైపోయేది. ఛీ.... యింతటి నీచపు బ్రతుకు బ్రతికేదానికన్నా ఏ నుయ్యోలోపడి చస్తే మంచిదనుకుంటూ కృళ్లికృళ్లి యేడ్చేది.

ఆలోచించిచూస్తే తన భర్త యజమానీ చెప్పిన సలహాలో కొంత సత్యమే కనిపిస్తున్నట్లు తోచింది. నిజమే, రోజులు మారాయి. ధర్మం నశించింది, న్యాయానికి తావులేదీ ప్రపంచంలో. రెక్కలు విరుచుకొని గొడ్డు చాకిరిచేసినా రెండు రోజుల కొకసారి గూడా